క్లుప్తంగా

పారిశుధ్య పనులపై దృష్టి

● ఎంపీడీఓ ఈశ్వరరావు

సీతానగరం: గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని ఎంపీడీఓ ఎం. ఈశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చిన బోగిలి, తామరఖండి గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశుధ్య పనులతో పాటు దోమల నివారణకు మలాథియాన్ మందును పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

సీతానగరం: మండలంలో శనివారం రాత్రి వీచిన ఈదురుగాలులకు విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలను విద్యుత్ శాఖాధికారులు సరి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏపీఈపీడీసీఎల్ ఏఈ జగన్ మోహనరావు సోమవారం మాట్లాడుతూ, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నామని చెప్పారు. విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

గరుగుబిల్లి: శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ మధుసూదనరావు కోరారు. చదువంటే మాకిష్టం కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తకాలు చదివించడంతో పాటు క్విజ్, పలు క్రీడాపోటీలు సోమవారం నిర్వహించారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ శిబిరాల్లో చిన్నారుల మేధాశక్తి పెరుగుదలకు, సృజనాత్మకత పెంపొందించేందుకు, జ్ఞాన సంపాదనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సరదా వాతావరణంలో ఆటపాటలతో కూడిన విద్యనందిస్తుండడంతో పిల్లలు కూడా గ్రంథాలయాలకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తుండడం చాలా ఆనందంగా ఉందన్నారు.

మహా రుద్రాభిషేకం



పూజల్లో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా ఆలయ 22వ వార్షికోత్సవంలో భాగంగా మహారుద్రాభిషేకం సోమవారం నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ తదితర పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో అర్చకులు ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రుద్రాభిషేకం చేపట్టారు. మంగళవారం, బుధవారం బిక్షాటన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వార్షికోత్సవం ముగింపు రోజున స్వామి వారికి పాలాభిషేకం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

పింఛన్ కోసం పడిగాపులు



ఎల్విన్‌పేటలో పింఛన్ నగదు కోసం వేచిచూస్తున్న లబ్ధిదారులు

గుమ్మలక్ష్మీపురం: పింఛన్ కోసం లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కుట్ర కారణంగా వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పంపిణీ అయిన పింఛన్లు నిలిచిపోయాయి. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేయడంతో లబ్ధిదారులంతా ఆ డబ్బుల కోసం బ్యాంకులు, మినీ బ్యాంకులు, ఆధార్ పే సెంటర్లకు చేరుకుని, తమ ఖాతాల్లో డబ్బులు పడ్డాయో లేదో చూసుకుంటున్నారు. పింఛన్ కోసం మండల కేంద్రానికి వచ్చిపోయేందుకు వ్యయప్రయాసలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తేనే తమ కష్టాలు తీరుతాయని అంటున్నారు.

బొండపల్లిలో జూనియర్ కళాశాల ప్రారంభం

బొండపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రభుత్వం జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసింది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతులను ఎంఈఓ శోభారాణి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రభుత్వం జూనియర్ కళాశాలలను అందు బాటులోకి తీసుకు వచ్చిందని చెప్పారు. స్థానిక కళాశాలలో ఇంత వరకు ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 18 మంది, సీఈసీ గ్రూపులో ఆరుగురు చేరారని తెలిపారు. మండలంలోని విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను స్థానిక కళాశాలలో చేర్పించాలని కోరారు.ఎంఈఓ-2 అల్లు వెంకటరమణ,హెచ్ఎం ఉమామేశ్వరరావు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలకొండపై పట్టు ఎవరిదో..

- మరికొద్ది గంటల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- గెలుపోటములపై పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఉత్కంఠ

పాలకొండ రూరల్:

సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై అటు అభ్యర్థులు, ఇటు కార్యకర్తలు, ప్రజల్లో నెలకొన్న ఉత్కంఠకు మరికొద్ది గంటల్లో తెరపడనుంది. పోలింగ్ పూర్తయినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడ చూసినా.. ఏ ఇద్దరు కలిసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చ. ఎవరు గెలుస్తారు? ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? ఎవరికి ఎంత మెజార్టీ వస్తుంది? తదితర అన్ని ప్రశ్నలకు నేడు సమాధానం లభించనుంది. ఓటర్ల తీర్పుపై అన్ని పార్టీల నాయకులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

14 టేబుళ్లు.. 21 రౌండ్లు

జిల్లాలో గరుగుబిల్లి మండలంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ప్రతీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంల లెక్కింపునకు 14, పార్లమెంట్ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 20 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ముందుగా పోస్టల్, సర్వీసు ఓట్లు లెక్కించి అనంతరం ఈవీఎంలను లెక్కపెట్టనున్నారు.

గత ఎన్నికల్లో ఇలా..

2014 ఎన్నికలతో పోల్చుకుంటే 2019లో వైఎస్సార్‌సీపీకి ఏజెన్సీ ఓటర్లతో పాటు మైదాన ప్రాంత ఓటర్లు పట్టం కట్టారు. 2014లో టీడీపీ అభ్యర్థి నిమ్మక జయకృష్ణపై 1,620 ఓట్ల ఆధిక్యతతో విశ్వాసరాయి కళావతి గెలుపొందారు. 2019 ఫలితాల్లో 17,980 ఓట్ల భారీ ఆధిక్యంతో తన ప్రత్యర్థి జయకృష్ణపై మరోమారు విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో 1,35,985 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వాటిలో పురుషులు



66,582 మంది, స్త్రీలు 69,401 మంది, ఇతరులు 2 ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 2,819 అధికంగా ఓటును వినియోగించుకున్నారు. ఈ రెండు ఎన్నికల్లో గిరిపుత్రులు, నియోజకవర్గ మహిళ ఓటర్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి గెలుపులో కీలకంగా వ్యవహరించారు.

తాజాగా ఎన్నికల్లో ఇదీ పరిస్థితి..

తాజా ఎన్నికల్లో 1,100 కొత్త ఓటర్లు నమోదయ్యారు. దీంతో ఈ ఏడాది నియోజకవర్గంలో 1,95,020 మందికి ఓటు వేసేందుకు అర్హత లభించింది. 1,46,781 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 74.02 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో పురుషులు 71,777 మంది(49 శాతం), స్త్రీలు 74,990 మంది(51 శాతం) ఉన్నారు. పురుషుల కంటే అధికంగా 3,213 మంది మహిళా ఓటర్లు(2 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళా ఓటర్లే అభ్యర్థుల గెలుపోటములు నిర్ణయించడంలో కీలకం కానున్నారు. ఈ ఎన్నికల్లో కూడా పురుషుల కంటే మహిళలు అధికంగా ఓటు వేయడం, గ్రామీణ ప్రాంత ఓటర్లు పెరగడంతో వారంతా ప్రభుత్వానికి సానుకూలంగా ఓట్లు వేశారని ఎగ్జిట్ పోల్స్ ద్వారా స్పష్టం కావడం, ప్రత్యర్థిగా ఈ సారి కూడా జనసేన పార్టీ నుంచి నిమ్మక జయకృష్ణ బరిలో నిలవడం.. అన్నింటినీ బేరీజు వేసుకుంటే ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి గెలుపు ఖాయమని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

హ్యాట్రిక్ విజయంపై కళావతి గురి

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బలపరిచిన అభ్యర్థులే గెలుపొందడం పరిపాటిగా మారింది. గత 25 ఏళ్లుగా జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే.. 2004లో మినతి గొమాంగో, 2009లో నిమ్మక సుగ్రీవులు, 2014, 2019లలో వరుసగా విశ్వాసరాయి కళావతిలు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. నేడు 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూడా మరోసారి విశ్వాసరాయి కళావతి గెలుపొంది హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పాలకొండలో టీడీపీ అంపశయ్యపై ఉండడంతో పొత్తులో భాగంగా ఇక్కడ టికెట్‌ను జనసేనకు కేటాయించారు. పార్టీ మారిందే తప్ప ప్రత్యర్థి మారకపోవడంతో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి భారీ మెజార్టీతో గెలుస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. జాతీయ మీడియాతో పాటు అన్ని సర్వేలు, ఇటీవల వెల్లడైన ఎగ్జిట్ పోల్స్ కూడా వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాయి. ఎప్పుడూ మన్యం ఓటర్లు వైఎస్సార్‌సీపీవైపే ఉన్నారు. ఈ సారి కూడా మన్యం ఓట్లు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటు వేసినట్లు పోలింగ్ సరళిని బట్టి స్పష్టమవుతోంది. 2014లో 1650 ఓట్లు మెజార్టీతోను, 2019లో 18,353 ఓట్లు మెజార్టీతో కళావతి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మంగళవారం వెల్లడయ్యే ఫలితాల్లో మూడోసారి ఎమ్మెల్యేగా విజయ కేతనం ఎగురవేసి హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంటారని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

నియోజకవర్గం: పాలకొండ	
మండలాలు:	4
పంచాయతీలు:	108
మొత్తం జనాభా:	2,43,267
పురుషులు:	99,325
స్త్రీలు:	94,328
ఇతరులు:	14

మండలం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
సీతంపేట	45,195	36,192	80
భామిని	38,003	27,193	71
పాలకొండ	37,233	28,049	75
వీరఘట్టం	51,521	39,216	76
పాలకొండ (నగర పంచాయతీ పరిధి 20 వార్డుల్లో)	23,068	16131	69

బరిలో నిచిన అభ్యర్థులు:	07
పోలింగ్ బూత్‌లు:	287
సీతంపేట:	1–105
భామిని:	106–149
పాలకొండ:	150–222
వీరఘట్టం:	223–287
మొత్తం ఓటర్లు:	1,93,676
పోలైన ఓట్లు:	1,46,781
మొత్తం లెక్కింపు రౌండ్లు:	21
కౌంటింగ్ కేంద్రం:	డాక్టర్ వైఎస్సార్ ఉద్యావన కళాశాల (గరుగుబిల్లి)

బూత్ సంఖ్య	మండలం	లెక్కించాల్సిన ఓట్లు
01–14	సీతంపేట	7,336
15–28	సీతంపేట	4,403
29–42	సీతంపేట	3,991
43–56	సీతంపేట	4,094
57–70	సీతంపేట	5,002
71–84	సీతంపేట	4,967
85–98	సీతంపేట	4,584
99–112	సీతంపేట–భామిని	6,011
113–126	భామిని	8,145
127–140	భామిని	9,144
141–154	భామిని–పాలకొండ	8,137
155–168	పాలకొండ	8,440
169–182	పాలకొండ	9,599
183–196	పాలకొండ	9,385
197–210	పాలకొండ	7,959
211–224	పాలకొండ–వీరఘట్టం	7,297
225–238	వీరఘట్టం	8,197
239–252	వీరఘట్టం	8,332
253–266	వీరఘట్టం	8,801
267–280	వీరఘట్టం	8,438
281–287	వీరఘట్టం	4,519

ముమ్మరంగా పామాయిల్ గెలల కోతలు



కొనుగోలు కేంద్రానికి తరలిస్తున్న గెలలు

సీతానగరం: మండలంలో పామాయిల్ తోటలు సాగు చేస్తున్న రైతులు గెలలు కోసే పనుల్లో బిజీగా ఉన్నారు. నీటివనరులు, రహదారి సౌకర్యం ఉన్న తామరఖండి, గెద్దలుప్పి, బల్లకృష్ణాపురం, వెంకటాపురం, బూర్జ, లచ్చయ్యపేట, అప్పయ్యపేట, బగ్గందొరవలస, కొత్తవలస, రేపటివలస గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పామాయిల్ సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో మొక్కలు ఏపుగా పెరిగాయి. ఆశించిన దిగుబడి రావడంతో గెలలు కోసి చినబోగిలి వద్దనున్న కొనుగోలు కేంద్రానికి తరలిస్తున్నారు. ఈ విషయమై ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష వద్ద ప్రస్తావించగా.. మూడేళ్ల కిందట వేసిన మొక్కల నుంచి దిగుబడి బాగా వచ్చిందన్నారు. గెలలు వచ్చేవరకు పామాయిల్ తోటలో మిశ్రమ పంటలుగా పెసర, మినుము, జొన్న, వేరుశనగ, అరటి పంటలు వేసి రైతులు అదనపు ఆదాయం పొందారని చెప్పారు. గిట్టుబాటు ధర ఉండడంతో ఎక్కువ మంది రైతులు పామాయిల్ సాగుపై మొగ్గు కనబరుస్తున్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ



పణుకుపేట ఆర్‌బీకేలో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో, తదితరులు

● ఏఓ అవినాష్

సీతానగరం: రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ ఎల్.అవినాష్ తెలిపారు. మండలంలోని పణుకుపేట ఆర్‌బీకేలో పలువురు రైతులకు వరి విత్తనాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 ఖరీఫ్ కాలానికి సంబంధించి అవసరమైన విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కిలో విత్తనాలపై పది రూపాయల రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎంటీయూ 1064, ఎంటీయూ 1121, ఆర్‌జేఎల్ 2537, బీపీటీ 3291, ఎంటీయూ 7029, బీపీటీ 5204, ఎంటీయూ 1318 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ఇప్పటివరకు ఆర్‌బీకేల ద్వారా పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. జీలుగ విత్తనాలు 95.6 క్వింటాళ్లు, కట్టె జనుము 120 క్వింటాళ్లు, పిల్లి పెసర 3 క్వింటాళ్లు రాయితీపై పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం



శ్రీకాకుళం రహదారిలో విద్యుత్ తీగలపై పడిన ఫ్లెక్సీ

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో ఏఈ శ్యామ్‌సుందర్ అన్నారు. సోమవారం స్థానిక విలేకరుతో మాట్లాడుతూ.. ముఖ్యంగా ప్రధాన రహదారులు, వీధి కూడళ్ల వద్ద, వ్యాపార సముదాయాలపై ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు, ప్రచార సైన్, గ్లోసిన్ బోర్డులు కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు తెలిపారు. వర్షంతో పాటు భారీ గాలులు వీస్తుండటంతో ఆ ధాటికి ఈ బోర్డులు విద్యుత్ స్తంభాలపై, వైర్లపై ఒరిగిపోవటంతో సమస్యలు తలెత్తుతున్నట్లు పేర్కొన్నారు. వాటి నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. వాటికి ఉన్న ఇనుప చువ్వల కారణంగా ప్రమాద తీవ్రత పెరిగే అవకాశాలే అధికమని గుర్తించాలన్నారు. సోమవారం ఈ తరహాలో విద్యుత్ వైర్లపై పడిపోయిన ఫ్లెక్సీలను తొలిగించే ప్రక్రియ చేపట్టారు.

హద్దు మీరితే కఠిన చర్యలు



పెద్దకాపువీధి యువతతో మాట్లాడుతున్న ఎస్సై

పాలకొండ రూరల్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి సమయంలో అల్లర్లు సృష్టించేందుకు యత్నించినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని అవలంగి, జి.వెంకటాపురం గ్రామాలతో పాటు పట్టణంలోని పెద్దకాపు వీధిలో పోలీస్ పికెటింగ్ కొనసాగుతున్న ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. లెక్కింపు ప్రక్రియ ముగిసి, ఫలితాలు వెలువడే వరకూ ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. హద్దు మీరితే కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో 144 సెక్షన్‌తో పాటు పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉందని గుర్తుచేశారు. యువత చైతన్యవంతులై మెలగాలని, ఇతరులకు అవగాహన కల్పించాలని కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఖోఖో ఆటలో నిమగ్నమైన విద్యార్థులు

పాలకొండ రూరల్: రోజువారీ పనులతో ఒత్తిడికి గురైన శరీరానికి ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని అందించేందుకు క్రీడలు ఎంతగానో సహకరిస్తాయని శాఖగ్రంథాలయ అధికారి బబ్బూరి గణేష్‌బాబు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులతో ఖోఖో ఆడించారు. ఈ సందర్భంగా ట్రైనర్ జి.మురళి మాట్లాడుతూ.. చదువులతో పాటు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయన్నారు. క్రమం తప్పకుండా ఆటలు ఆడటం వలన కలగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం గ్రాఫ్ పెయింటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. తెలుగు ఉపాధ్యాయుడు కె.జనార్దనారావు తెలుగు పద్యాలు, వాటి తాత్పర్యాలను వివరించారు. పుస్తకాలు మంచి నేస్తాలని, వాటిని నిరంతరం పఠించాలని విద్యార్థులకు సూచించారు.

వాహన తనిఖీలు



వాహనదారుల లైసెన్స్‌లు పరిశీలిస్తున్న ఎస్‌ఐ షణ్ముఖరావు

కురుపాం: మండల కేంద్రంలో పోలీసులు సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ షణ్ముఖరావు వాహనదారుల లైసెన్స్, వాహనాలకు సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించారు. వాహనాలతో బయటకు వచ్చే వారంతా లైసెన్స్, బండికి సంబంధించిన పత్రాలను వెంట తీసుకురావాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. కారు నడిపేవారంతా సీటుబెల్టు ధరించాలన్నారు. అలాగే ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి గొడవలు పడవద్దని సూచించారు.

హనుమాన్ చాలీసా పఠనం



హనుమాన్ చాలీసా పఠిస్తున్న భక్తులు

పాలకొండ రూరల్: శ్రీహనుమాను గురుదేవులు నాయద పలికెద సీతారామ కథ అంటూ భక్తులు ఆధ్యాత్మిక ఆనంద పారవశ్యంతో ఆలపించారు. హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దక్షిణాముఖ ఆంజనేయ ఆలయంలో సోమవారం హనుమాన్ చాలీస గీతాలాపన కార్యక్రమం చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు, ఆధ్యాత్మిక వక్తలు కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని కీర్తించారు. ఆలయ అర్చకులు దాకమర్రి సూర్యరావు, జోష్యుల అంజనేయశర్మ నేతృత్వంలో అంజినీ పుత్రునికి విశేష పూజలు నిర్వహించారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ: స్థానిక మోడల్ స్కూల్‌లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024–25 విద్యాసంవత్సరంలో 7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు విద్యార్థులు ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గరిష్ట వేతనం పొందేలా పనులు



మస్తర్లను పరిశీలిస్తున్న ఏపీఓ ఎస్.ఈశ్వరమ్మ

మక్కువ: ఉపాధి హామీ పథకం వేతనదారులు గరిష్ట వేతనం పొందేలా పనులు చేపట్టాలని ఉపాధి ఏపీఓ శంబంగి ఈశ్వరమ్మ సూచించారు. మండలంలోని సన్యాసిరాజపురం గ్రామ సమీపంలో వెంగళరాయి సాగర్ ప్రాజెక్ట్ కాలువలో పూడికతీత పనులు, కన్నంపేటలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పని ప్రదేశం వద్ద కొలతల ఆధారంగా పనులు నిర్వహించాలన్నారు. మస్తర్ల నిర్వహణలో ఎటువంటి తప్పులు చోటుచేసుకున్నా సహించేది లేదన్నారు. మస్తర్ల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పనుల వద్ద ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు



పట్టణంలోని ఓ లాడ్జీలో వసతి పొందుతున్న వారి వివరాలు సేకరిస్తున్న ఎస్సై ప్రశాంత్‌కుమార్

పాలకొండ రూరల్: స్వార్వత్రిక ఎన్నికల లెక్కింపు సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సోమవారం తెల్లవారుజామున పట్టణంలోని లాడ్జీలు, ప్రైవేటు వసతి గృహాలు, కళ్యాణ మండపాలను ఎస్సై ఎస్.ప్రశాంత్ కుమార్ నేతృత్వంలో సిబ్బంది తనిఖీలు చేశారు. వసతి పొందుతున్న, పొందేందుకు వచ్చిన వ్యక్తుల ఆధార్, పూర్తి చిరునామాలు, ఫోన్ నంబర్, తదితర వివరాలను సేకరించాలని లాడ్జీల నిర్వాహకులకు సూచించారు. అనుమానిత వ్యక్తుల సమాచారం అందించాలని కోరారు. ఎన్నికల కమిషన్ నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేవరకూ పట్టణంలో 144 సెక్షన్‌తో పాటు పోలీస్ యాక్ట్–30 అమల్లో ఉంటుందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి నిబంధనల మేరకు నడచుకోవాలని సూచించారు.

ఈదురుగాలులు, భారీ వర్షం



ఈదురుగాలులకు విరిగిపడిన చెట్టుకొమ్మ

పాలకొండ/భామిని:

మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు, పంటపొలాల్లో నీరు చేరింది. గత వారం రోజులుగా తీవ్ర ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం లభించింది. ఇటుకల పరిశ్రమలకు ఈ వర్షం తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఖరీఫ్ దుక్కులు, వరి నారుమడులు సిద్ధం చేసుకునేందుకు ఈ వర్షం అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు.